

ద్విభాష్యం రాజేశ్వరరావు

# క్షమయా ధరిత్రీ...

నిద్రపట్టక మంచంమీద ఇటూ అటూ దొర్లుతున్నాను.

సాయంకాలం నాలుగు చినుకులు పడ్డాయి, కళ్ళాపు జల్లినట్లు॥ అందుకే ఈ ఉక్క। అసలు గాలి ఆడటంలేదు।

విసనకర్రతో కాస్సేపు విసురుకుని, చేతులు నొప్పిపుడితే, పక్కనే పడేశాను. కాస్త ఎడంగా సుజాత గాఢ నిద్రలో వుంది।

అవతల మూల బొంతమీద పిల్లలిద్దరు ఒళ్ళుమరిచి నిద్రపోతున్నారు.

గదిలో వెలుగుతున్న జీరో వాట్ బల్బుచుట్టూ పసరికదోమలు తిరుగుతున్నాయి. ఉండీ ఉండీ నా ముఖంమీద వాలి చికాకు పెడుతున్నాయి.

వాటిది ఘోరమయిన వాసన। భరించలేని కంపు॥

నిద్రపట్టక లేచి కూర్చున్నాను।

సుజాత ముఖంనిండా దోమలు ముసిరి వున్నాయి। అంతలా దోమలు కుట్టేస్తున్నా కదలకుండా మెదలకుండా హాయిగా నిద్రపోతోంది। పిడుగులు పడుతున్నా, గాలి అదకపోయినా, ఏదిఏమైనా, రాత్రి పడుకుందంటే తెల్లవారే వరకూ నిద్ర లేవదు।

నిద్ర పట్టటం కూడా ఒక వరమే కాబోలు।।

అంతలో—దభీలుమని చప్పుడయింది।

ఒక్కసారి ఉలిక్కిపడ్డాను।

బలంగా తలుపువేసిన చప్పుడు। అవతలి వాటాది కాబోలు।

ఆ తర్వాత రెండు క్షణాల్లో ఏడుపు విన్పించింది।

లేచి నిలబడి గది కిటికీలోంచి అవతలి వైపుకు చూశాను. అవతల అంతా కటిక చీకటిగా వుంది. చినుకులు అరంభమయ్యాయి చిన్న శబ్దంతో। గదికి అవతల వరండా వుంది. అది దాటితే రోడ్డే।।

వరండాలో ఎవరో ఉన్నట్లు అలికిడి అయింది.

మళ్ళీ ఏడుపు ఆగి ఆగి స్పష్టంగా వినిపించటం ఆరంభించింది.

"ఎవరు?" గట్టిగా పిలిచేను, కిటికీలోంచి అవతలవారికి వినిపించేలా.

సమాధానం లేదు।

మరోసారి గట్టిగా పిల్చేను।

ఎవరో స్త్రీ ఏడుస్తున్నట్లు స్పష్టంగా విన్పిస్తోంది। కాని సమాధానం మాత్రం రాలేదు. గది తలుపు తెరచి బయట వరండాలోనికి వచ్చేను.

ఆది నాలుగు వాటాల ఇల్లు। వరుసగా గది, వంటిల్లు చొప్పున నాలుగు వరుసలు కట్టేరు. అన్నిటికీ వీధివరండా మాత్రం కామన్‌గా ఒకటే వుంది। ఆ వరండా దాటితే రోడ్డు। నాలాటి చిన్న ఉద్యోగికి అందుబాటులో వుండే ఇల్లు అదే। దానికే ఈ మహాపట్నంలో రెండు వందల రూపాయలు అద్దె ఇవ్వాల్సి వస్తోంది। పక్క రెండు వాటల్లోనూ స్కూలు టీచర్లు వుంటున్నారు. అవతలి చివరి వాటాలో ఒక పోలీసు వుండేవాడు. ఈ మధ్యనే అతడు ఖాళీచేసి వెళ్ళిపోయాడు।

తర్వాత పదిరోజుల క్రితం ఆ వాటాలో ఒక లారీడ్రైవర్ దిగేడు।

అతడు, అతడి భార్య వుంటున్నారు।

వరండాలో దీపం లేదు।

కామన్ వరండా కావటంవల్ల బల్బు వేస్తే కరెంటు ఎవరు కట్టాలన్న మీమాంసలో రెండేళ్ళుగా అక్కడ దీపం లేకుండానే కాలం గడుపుతున్నాం। చీకటిగా వున్నా, వరండా అవతలి చివర ఎవరో స్త్రీ నిలబడివున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"ఎవరు?" గట్టిగా గొంతు పెంచి అడిగేను.

ఈ సారి నోటికి చీరె అడ్డంపెట్టుకుని వెక్కివెక్కి ఏడ్వటం వినిపించింది.

"ఎవరంటే మాట్లాడరేం?" కాస్త చికాకుగా అడిగేను.

"నేనండీ! లలితను!" ఈ సారి సమాధానం వచ్చింది.

లలిత ఆఖరి వాటాలో దిగిన డ్రైవర్ భార్య.

"ఏం? లలితమ్మా! ఎందు కేడుస్తున్నావ్! ఏమయింది?" అంటూ అడిగేను నిలబడిన చోటునుండి కదలకుండానే.

లలిత సమాధానం చెప్పలేదు.

ఏడుపు కప్పిపుచ్చుకునే యత్నంలో ముక్కు ఎగబీలుస్తున్న శబ్దం మాత్రం స్పష్టంగా విన్పిస్తోంది.

ఆమె భర్తకు ఏమయినా అయిందా కొంపదీసి?

అయితే వరండాలో నిలబడి ఏడవటం ఎందుకు?

నాకు విపిపించిన తలుపు చప్పుడు ఆ ఇంటిదే అయివుండాలి.

లలితకూ, భర్తకూ ఏమయినా గొడవ అయిందా?

నాకు విషయం ఏమీ అర్థంకాలేదు.

లలిత నుండి సమాధానం వచ్చేలా లేదు!!

అందుకని, గదిలోకి వచ్చి సుజాతను నిద్రలేపాను.

ఆమెను లేపటానికి కనీసం అయిదు నిమిషాలు పట్టింది నాకు.

"ఏమిటా మొద్దు నిద్ర! లే!" అన్నాను.

"అప్పుడే తెల్లారి పోయిందా?" అంటూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచి "పాలవాడు వచ్చాడా?" అంది.

"ఇంకా తెల్లారలేదు! అర్ధరాత్రి పన్నెండు దాటింది! అంతే! అవతల వరండాలో లలితమ్మ నిలబడి ఏడుస్తోంది! ఏమయిందో కాస్త కనుక్కో!" అన్నాను.


పక్కింటి ఆడపిల్ల అర్ధరాత్రి పూట వరండాలో నిలబడి ఏడుస్తూంటే సంబంధం లేనట్లు తలుపులు మూసుకుని నిద్ర పోవటం మనసొప్పలేదు!

"లలిత ఏడుస్తోందా? ఎందుకు?" అంటూ లేచింది.

"ఏమో! ఎందుకో తెలీదు! నాకు నిద్ర పట్టక దొర్లుతూంటే ఎవరో ఏడుస్తున్న అలికిడి అయి తలుపు తీసి చూశాను. తీరా చూస్తే లలితమ్మ! ఎందు కేడుస్తున్నావని అడిగితే సమాధానం చెప్పటంలేదు!" అంటూ నేను చెప్తూవుంటే సుజాత బయటకు వెళ్ళింది!

రెండు నిమిషాలలో లలితను అనునయిస్తూ ఇంట్లోకి తీసుకువచ్చింది.

లలితకు నిండా యిరవై యేళ్ళుండవు! పిల్ల బంగారుబొమ్మలా వుంటుంది! పదో తరగతి పాసయి చదువు ఆపేసిందట! చాలా పేద కుటుంబం కావటం వల్ల రెండో పెళ్ళివాడికిచ్చి చేశారట! అతడి పేరు సర్వయ్య! ముప్ఫయి నాలుగేళ్ళకు పైగానే వుంటాయి! మనిషి చూడటానికి చాలా మొరటుగా, భీక




రంగా వుంటాడు! ఇంట్లో దిగిన తర్వాత ఈ పదిరోజుల్లోనూ ఒక్కసారే అతడిని చూసేను నేను! నాకు మర్యాద ఇస్తున్నట్లు అతడి చేతిలోని సగం కాలిన చుట్టని గిరాటేస్తూ "దండాలు పంతులూ!" అన్నాడు ఆవేళ. అంతకంటే మేమిద్దరం ఎప్పుడూ కలిసి మాట్లాడుకోవటం కుదరలేదు!

అయినా అతను ఇంట్లో వుండేదే చాలా తక్కువ!

లలిత చాలా నెమ్మదయిన మనిషనీ, చాలా కలుపుగోలుగా వుంటుందనీ సుజాత నాతో చెప్పింది.

"ఏం జరిగింది లలితా!" అంది మా ఆవిడ బుజ్జగిస్తున్నట్లు.

నేను దగ్గరవుండటం భావ్యంకాదని వీధి వరండాలోనికి వచ్చేశాను.

లోపలి మాటలు నాకు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఆయన లైనుమీదికి వెళ్ళి పది గంటలకు వచ్చేరు! వచ్చేసరికి బాగా తాగి వున్నారు. అది కాకుండా మరో సీసా ఇంటికి పట్టుకు వచ్చేరు! అది కూడా తాగేస్తూవుంటే వద్దని వారించేనని చితక్కొట్టి బయటకు నెట్టేసి తలుపేసుకున్నారు," అంది.

నేను దీర్ఘంగా నిట్టూర్చేను!

మామూలు కథే!!

ఈ దేశంలో సగటు కథే!!

ఈ కథేకు ఆరంభమే కాని, అంతం లేదా?

ఈ సమస్యకు పరిష్కారం దొరకదా?

ఈ నిస్సహాయ రోదన నుండి స్త్రీలకు విముక్తి లభించదా?

ప్రతి సమస్యకూ పరిష్కారం వుంటుంది. అలాగే ఈ సమస్యకూ వుండాలి. వుండితీరాలి!!

"పద! మేం ఇద్దరం వచ్చి నచ్చ చెబుతాం. ఇంకెప్పుడూ ఇలాటి పని చెయ్యవద్దని గట్టిగా మందలిస్తాం!" అంది సుజాత.

"అమ్మో! అలాటి పని మాత్రం చెయ్యొద్దు!" లలిత కంఠం భయంగా ధ్వనించింది.

"ఏం? ఎందుకని?"

"మిమ్మల్ని కూడా తిడతారు ఈ మైకంలో! ఇప్పుడు ఏం చెప్పినా ఆయన తలకెక్కదు! పైగా మిమ్మల్ని తీసుకు వచ్చేనని నన్నుకూడా చావగొడతారు! వద్దు బాబో!" అంది లలిత.

ఆ మాటలు అంటూంటే ఆమె స్వరం కంపించటం నాకు స్పష్టంగా విన్పించింది.

"పోనీ, ఈ రాత్రికి ఇక్కడే వుండిపో! తెల్లవారుఝామున లేచి వెళ్లవు గానిలే!" అంటూ సముదాయించింది మా ఆవిడ.

"వద్దండీ ఆయనకు కోపం వస్తుంది!"

"ఏం ఫర్వాలేదు! ఉదయం వచ్చి నేను సర్ది చెపుతానులే!"

"అబ్బే! వద్దు! వెళ్ళిపోతాను!" అంది లలిత.

"అది కాదు...." అంటూ ఏదో చెప్ప బోయింది సుజాత. ఆమె మాటలకు అడ్డు పడుతూ "తలుపు దగ్గరే వరండాలో కూర్చుంటాను! కొంచెంసేపు పోతే మళ్ళీ ఆయనే తలుపు తీసి పిలుస్తారు! ఆ సమయంలో అక్కడ వుండకపోతే మళ్ళీ మండిపడతారు...." ఆ తర్వాత గొంతు తగ్గించి ఏదో చెప్తోంది లలిత! నాకు వాళ్ళ సంభాషణ సరిగ్గా వినబడ లేదు! బయటకూడా వానజోరు హెచ్చవు తోంది.

జల్లు వరండా చివర అంచుల్ని తడిపే స్తోంది,

అయిదు నిమిషాలు ఇటూ అటూ వరండాలో పచార్లుచేస్తూ గడిపేశాను!

అంతలో-కళ్ళు తుడుచుకుంటూ లలిత గదిలోంచి బయటకు వచ్చింది.

"ఏం లలితా! ఈ వేళ్టికి మా ఇంట్లో పడుకోపోయావా? నేను బయట ఇలా వరండాలో వేసుకుంటాన్లే!" అన్నాను.

"అబ్బే! వద్దండీ! ఫర్వాలేదు!" అంటూ గబగబ తమ పోర్షన్‌వైపు వెళ్ళి పోయింది.

తర్వాత మెల్లగా తలుపు తట్టటం ఆరంభమయిన అయిదు నిమిషాలకు ఆ మహానుభావుడు తలుపు తెరిచేడు! లలిత లోనికి వెళ్ళిపోయింది! భడేలున మళ్ళీ తలుపులు మూసుకున్నాయి!

అయిదారు నిమిషాల వరకూ లోపలి

మంది అతని గొంతు గట్టిగా విన్పిస్తూనే వుంది!

నేను దీర్ఘంగా నిట్టూర్చి లోనికివచ్చి తలుపు గడియపెట్టేను.

"ఈ రాత్రికి లలితను ఇక్కడే వుండమనకపోయావా? నేను బయట వరండాలో పడుకుందును గదా!" అన్నాను వాళ్ళ సంభాషణ ఏమీ విననట్లు.

"చెప్పేను! ససేమిరా వల్లకాదంది!"

"ఈ రాత్రికి కొట్టి చంపేస్తాడేమో ఆ పిల్లని, తాగుడు మైకంలో!" అనుమానంగా అన్నాను.

ఇప్పటివరకూ ఇలాటి తాగుడు గొడవలు మా నాలుగు పోర్షన్లలోనూ లేవు! ఇదో పెద్ద న్యూసెన్సుగా తయారవుతుందేమోనని మనసులో భయం కల్గిన మాటకూడా వాస్తవం!

"ఆ భయం అక్కరలేదండి! ఆయనగారికి ఈవిడగారు పక్కలో లేకుండా నిద్ర పట్టదుట! అంతా క్షణిక కోపమేనట! మళ్ళీ వెంటనే తగ్గిపోతుందట!" అంది సుజాత.

"అయినా అంత గొడవచేసి తన్ని బయటకు తోసేస్తే, మళ్ళీ వాడికి అవసరం వుంటుందని తలుపుదగ్గర కాసుకుని, రమ్మంటే వెంటనే పక్కలోకి దూరిపోవటానికి ఈ పిల్లకి సిగ్గులేదూ?" అన్నాను.

"బాగుందండీ! ఆడపిల్ల అంతకంటె ఏం చేయగలదు? మొగ వెధవలకి బుద్ధుండాలి గాని...." అంది సుజాత.

"వాడికి బుద్ధిలేదు అందుకని ఇంత రాద్ధాంతం జరుగుతున్నా వెంటనే వాడి పక్కలోకి దూరేస్తుందా?" అన్నాను.

సుజాత నా వంక రెండు క్షణాలు నిరసనగా చూసింది.

"వాడి పక్కలోకి కాకుంటే మరి మీ పక్కలోకి దూరమంటారేమిటి?" అంది.

"అది కాదు సుజాతా! నువ్వు నా పాయింటు అర్థం చేసుకోటం లేదు! పీకలమొయ్యా తాగివచ్చి, భార్యను నానా ఇబ్బంది పెడుతున్నాడు కదా! వాడు తోసేసినపుడు బయటకుపోయి, వాడికి అవసరం కలగ్గానే వెంటనే వెళ్ళిపోతూ వుంటే మరీ అలుసు కాదూ? ఇలా అయితే వాడు మరీ నెత్తికెక్కి కూర్చోడూ! కొంత అదుపులో పెట్టుకోవాలి గాని ఇలా అలుసిస్తే ఎలాగా? మొగవాడు ఇలా బరితెగించి పోవడానికి సగం కారణం ఆడవాళ్ళే! 'సర్దుకుంటాడులే' అని మొదట్లో ఊరుకుని కనీస నిరసన కూడా తెలియజెయ్యరు! అది ఆసరగా తీసుకుని మొగాడు మరీ బరితెగించి పోతాడు! అలవాట్లకు బానిసయిపోతాడు, తర్వాత ఇదీ పరిస్థితి! ఒకసారి కొండెక్కి కూర్చుంటే మరి దింపటం అంత సులువు కాదు! నేను రేపు ఆ అమ్మాయికి హితబోధ చేస్తాను! ఇలా అలుసివ్వవద్దని గట్టిగా చెప్తాను!" అంటూ నా చిన్న సైజు ఉపన్యాసం ముగించేను. అంతా విని మా ఆవిడ

తేలిగ్గా "సర్లెండి, అర్ధ రాత్రి పూట అంకమ్మ శివాలని, వాళ్ళిద్దరూ ఈపాటికి బాగానే వుండి వుంటారు మధ్యన మన కెందుకీ సంత? హాయిగా నిద్రపోండి!" అంటూ పక్కకు తిరిగి అర్జెంటుగా నిద్ర లోకి జారిపోయింది!

ఏ సమస్యా తమకు పట్టనట్లు వుండ టంలోనే స్త్రీలు సుఖం అనుభవిస్తారు కాబోలు! లలిత సంగతి నన్ను కదిపి నట్లు సుజాతను కదపలేదు! సాటి స్త్రీకి జరుగుతూన్న అన్యాయానికి ఏమాత్రం స్పందించనట్లు కూడా నాకు కనబడలేదు! చాలా తేలిగ్గా కొట్టిపారేస్తుంది సుజాత!

రెండు నిమిషాలు తిరిగేసరికి చిన్న స్వరంలో గురక పెట్టడం ఆరంభ మయింది! 'అహా ఏమి అదృష్టం సుజాతా నీది!' అనుకున్నాను మనసులో. ఇటూ అటూ చాలా సేపు దొర్లేను!

ఏ క్షణాన్నయినా మళ్ళీ ఆ ఇంట్లోంచి కెవ్వున కేక విన్పిస్తుందనీ, తర్వాత దభేలున తలుపు వేసుకున్న శబ్దం విన్పి స్తుందనీ, ఆ తర్వాత సన్నటి ఏడుపు విన్పిస్తుందనీ చాలా సేపు చెవులు రిక్కించు కుని అటువైపే ధ్యాసతో వున్నాను.

కాని అలాటిదేమీ జరగలేదు!

ఓ గంట తర్వాత నిద్రపట్టేసింది!

* * *

మరునటి సాయంకాలం స్కూలు నుండి వచ్చి కాళ్ళూ చేతులు కడుక్కొని, కాఫీ త్రాగి బయట వరండాలోనికి వచ్చేను. లలిత పువ్వులు బేరంచేసి కొం టోంది పువ్వులకుర్రాడు వెళ్ళిపోయాక "లలితమ్మా!" అంటూ పిలిచేను.

పువ్వులు తలలో తురుముకుంటూ "పిల్చేరా బాబాయ్‌గారూ!" అంటూ మా వాటావైపుకు వచ్చింది.

"సారీ! నిన్న రాత్రి మిమ్మల్ని డిస్టర్బ్‌చేశాను" నొచ్చుకుంటూ క్షమాపణ చెప్పుకుంది!

"ఫర్వాలేదులే!" అన్నా.

తర్వాత రెండు నిమిషాలు మా మధ్య నిశ్శబ్దం రాజ్యమేలింది.

విషయం ఎలా అరంభించాలో నాకు అంతుపట్టలేదు!

మెల్లగా గొంతు సవరించుకుని, "చూడు లలితా! నువ్వు బొత్తిగా నోరూ, వాయీ లేకుండా అమాయకంగా వుండి పోవటం మంచిది కాదు! నువ్వు మెత్తగా అణిగిమణిగి వుండే, అతడు బయటకు తోసేస్తే బయటకుపోవటం, మళ్ళీ రమ్మంటే లోపలికి వెళ్ళటం ఇదేం బాగా లేదు! నువ్వు కఠినంగా వ్యవహరిస్తే తప్ప వ్యవహారం సర్దుకోదు! మంచితనం తప్పుకాదు! కాని ఎదుటివాళ్ళు మన నెత్తిమీదకు ఎక్కి స్వారీచేయించుకునే మంచితనం మనలో వుండటం తప్పే! నువ్వు కొంత కఠినంగా వుండు!!" అన్నాను.

"కఠినంగా వ్యవహరించటమంటే... ఏం చేయమంటారు?"

ఆశ్చర్యంగా నా వంక చూస్తూ అడిగింది.

వెంటనే సమాధానం చెప్పలేక పోయాను.

అవును. ఏం చేయాలి?.

ఏం చెయ్యాలో ఎలా చెప్పను?.

ఆఖరికి రెండు క్షణాలు ఆగి అన్నాను "ఎదిరించు. అవసరం వస్తే తిరగబడు."

నా సలహాకు లలిత ముఖంలో రంగులు మారిపోయాయి.

నా వంక అదోలా చూసింది రెండు క్షణాలు.

ఆ చూపుకు నా ఒళ్ళు జలదరించింది. అసహ్యం కూడుకున్న చూపులవి.

"పెద్దవారు. మీరు నాలాటి దానికి ఇవ్వాల్సిన సలహా ఇదేనా? దైవ సమాన మయిన భర్తను ఎదిరించమంటున్నారా? అవసరం వస్తే తిరగబడమంటున్నారా? మంచి చెప్పటం పోయి ఇదా మీరు నాకు బోధించేది? 'క్షమయాదరిత్రీ' అంటూ ఓరిమి, క్షమ చూపించమని చెప్పాల్సింది లేదు సరికదా, ఇవా నాకు సలహాలు?" అంటూ ఊపిరి పీల్చుకోటానికి ఒక్క క్షణం ఆగి "ఈవేళ నాకయితే ఇలాటి సలహా చెప్పేరు కాని, ఇంకెవరికీ చెప్ప కండి." అంటూ రోషంగా నావంక చూసి గబగబా తన వాటాలోకి వెళ్ళిపోయి తలుపు వేసుకుంది. నేను అవాక్కయి నిలబడిపోయాను.

భార్య క్షమయా ధరిత్రీ అదే విధంగా ఓరిమితో వ్యవహరించాలి. నిజమే. కాని 'క్షమయాధరిత్రీ' అని చెప్పేముందు 'కార్యేషు మంత్రీ' అనికూడా చెప్పేయి శాస్త్రాలు. భర్త తప్పుదారిలో నడుస్తుంటే బతిమాలి లేదా బెదిరించి లేదా కోపించి ఇంకా కాకపోతే ఎదిరించి అతడిని సరియైన మార్గం వైపుకు తిప్పాల్సిన బాధ్యత భార్య మీద లేదా? అడుగులకు మడుగు లొత్తటం కాదు, అవసరమయితే అల్లరి చేసి మంచి మార్గంలో పెట్టొద్దూ? లేకపోతే నాశన మయిపోయేది ఎవరు? అతడే. తద్వారా ఆమె. ఏది ఏమయినా, ఎదురుచూడని సమాధానం లలితనుండి వచ్చేసరికి నాకు మాత్రం మతిపోయినట్లయింది.

ఆ రాత్రి — ఇటూ అటూ నిద్రపట్టక దొర్లుతూ వుంటే మళ్ళీ తలుపు ఢడేల్ మన్న శబ్దం — లలిత వెక్కి వెక్కి ఏడ్వటం వినిపించింది.

సుజాతను నిద్రలేపి వెళ్ళి చూద్దామని అనుకున్నాను — కానీ అంతలోనే ఆ ఆలోచన విరమించుకుని రెండో వైపుకు ఒత్తిగిలి పడుకుని నిద్రలోకి జారిపోయే యత్నం చేసేను

